జిందగీ
చింతన
నమస్తే తెలంగాణ హైదరాబాద్
సోమవారం 15 జనవరి 2024 www.ntnews.com

జీవితంలో ఒక మేలి మలుపు వ్యక్తిని శక్తిగా నిలుపుతుంది. భానుడి ప్రయాణ దిశలో మలుపు ఉత్తరాయణంగా పలకరిస్తున్నది. సంక్రాంతి సంబురంతో ఉత్తరాయణ పర్వకాలం ప్రారంభమైంది. ఇన్నాళ్లూ తెలిమంచు తెరలతో జోగాడిన భానుడు.. సంక్రాంతి సందడితో మేలుకుంటాడు. తన కిరణ స్పర్శతో ప్రకృతి కాంతకు కొత్త ఉత్సాహాన్నిస్తాడు. శిశిరంతో పాతనంతా పాతరపెట్టి... వసంతంతో కొత్తదనాన్ని అందిస్తాడు. గ్రీష్మతాపంతో భయపెట్టినా.. వర్షరుతువుతో హర్షింపజేస్తాడు. ఉత్తరంగా ఆదిత్యుడి పయనం ఉత్తరోత్తర ఉత్తమ కాలానికి సంకేతం.

సంక్రాంతికి స్వాగతం

'సమ్యక్ క్రాంతి సంక్రాంతి'– అంటే మనోజ్ఞమైన క్రాంతి అని అర్థం. సౌరమానం ప్రకారం ప్రతినెలా ఒక్కో రాశిలోకి సూర్యుడు ప్రవేశిస్తాడు. ఇలా సంవత్సరంలో పన్నెండు సంక్రాంతులు వస్తాయి. వాటిలో సూర్యుడు మకర రాశిలో ప్రవేశించడాన్ని అంటే మకర సంక్రమణాన్ని సంక్రాంతి పండుగగా చేసుకుంటాం. నేటి నుంచి సూర్యుడి గమనం ఉత్తర దిశగా సాగుతుందని చెబుతారు. దేవతలకు పగటి వేళగా చెప్పే ఉత్తరాయణం ఆధ్యాత్మిక సాధనకు అనువైన సమయంగా పేర్కొంటారు. దక్షిణాయనం పండుగలకు ఆలవాలమైతే... ఉత్తరాయణం సాధకులకు అనువైన కాలం. సంక్రాంతి మొదలు వాతావరణంలో వేడి నిదానంగా పెరుగుతుంది. చలి తీవ్రత తగ్గుతుంది. మనిషికి రోగనిరోధకశక్తి పెరిగే కాలం ఇది. పంటలు సమృద్ధిగా పండే సమయం ఇది. వృక్షజాతులు సమృద్ధిగా ఫలించే తరుణమిది. అందుకే ఉత్తరాయణానికి ఇంత ప్రాధాన్యం.

మకర సంక్రమణం సందర్భంగా దేశవ్యాప్తంగా సంక్రాంతి పండుగ కోలాహలంగా జరుపుకొంటారు. తెలుగు రాష్ట్రాల్లో భోగి, సంక్రాంతి, కనుమ, ముక్కనుమ ఇలా నాలుగు రోజుల పాటు సంక్రాంతి సంబురం కొనసాగుతుంది. సంక్రాంతి సందర్భంగా గడపకు పసుపు పెట్టి, గుమ్మానికి పచ్చని మామిడి తోరణాలు కట్టి, రంగురంగుల రంగవల్లులతో వాకిళ్లను అందంగా అలంకరిస్తారు. ఆవు పేడతో గొబ్బెమ్మలు పెడతారు. ఇంట్లో పిండివంటలు, పరమాన్నం చేసి సంక్రాంతి పురుషుడిని శ్రీమన్నారాయణుడిగా భావించి ఆరాధిస్తారు. సంక్రాంతి నోము నోచుకొని, ముత్తయిదువలకు వాయనాలు సమర్పిస్తారు. తెలంగాణలో పండుగ సందర్భంగా వారం ముందునుంచే రకరకాల పిండి వంటలు చేసుకుంటారు. అలా సంక్రాంతిని 'అప్పాల పండుగ' అనికూడా పిలుచుకుంటారు. ముఖ్యంగా నువ్వులు బెల్లంతో చేసిన ఉండలను ఇచ్చి పుచ్చుకుంటారు. బెల్లం–నువ్వులు దానం వల్ల గ్రహదోషాలు పరిహారం అవుతాయని నమ్మకం. అంతేకాకుండా, నువ్వుల లడ్డూలు ఈ కాలంలో శరీరానికి కావాల్సిన వేడిని, శక్తిని అందిస్తాయి. ఇలా ప్రతి ఆచారం వెనుక ఒక పరమార్థాన్ని నిక్షిప్తం చేశారు మన పెద్దలు.

మన సంస్కృతిలో ప్రతి పండుగ సారాంశం ఇతరుల మేలు కోరడమే. పంటలు ఇళ్లకు చేరే కాలంలో వచ్చే సంక్రాంతి కూడా అలాంటిదే. రైతులు తమ పొలంలో పని చేసిన కూలీలకు, అవసరార్థులకు తోచినంత ధాన్యం ఆత్మీయంగా దానం చేస్తారు. ఈ సమయంలోనే ఊరూరా తిరిగే హరిదాసులు, గంగిరెద్దుల వాళ్లు, బుడబుక్కలవాళ్లకు ఎంతో కొంత సమర్పించుకుంటారు. ఇన్ని ప్రత్యేకతలు ఉన్న సంక్రాంతితో మొదలయ్యే ఉత్తరాయణ పుణ్యకాలం సమస్త మానవాళికి పుణ్యప్రదం.

సాధన మార్గం

ఆధ్యాత్మిక సాధనలన్నీ మోక్షాన్ని పొందడానికే! ఇహంలో సకల సంపదలతో తులతూగినా.. పరంలో సాధించాల్సిన స్థిరమైన సంపద మోక్షమే కదా! మహోన్నతమైన పురుషార్థాన్ని పొందడానికి అనువైన కాలం ఉత్తరాయణం. పవిత్రమైన, శాస్త్రోక్త సత్కర్మలకు ఉత్తరాయణం ప్రధానమైందని ఆగమాలు చెబుతున్నాయి. శుద్ధికి, సిద్ధికి శీఘ్ర ఫలకారిగా అనుకూలించే సమయమిది. ఉత్తరాయణాన్ని దేవయానంగానూ అభివర్ణిస్తారు. కాంతి, వెలుగు ఇచ్చే మార్గంగా దీన్ని చెబుతారు. దక్షిణాయనాన్ని పితృయానంగా చెబుతారు. ఇది చీకటి మార్గం, ధూమ మార్గం. వెలుగు మార్గంలో పయనించిన వారు, సూర్యుడి అనుగ్రహాన్ని పొందుతారు. ఈ తత్త్వాన్ని గ్రహించిన ఉపాసకులు ఉత్తరాయణ కాలాన్ని ఆధ్యాత్మిక సాధనకు వినియోగించుకుంటారు.

> “ **సంక్రాంతి** పర్వదినం సందర్భంగా పితృదేవతలకు ప్రీతి కలిగించేలా తర్పణాలు విడుస్తారు. సంవత్సరంలో ప్రతి రవి సంక్రమణానికీ పితృదేవతలకు తర్పణాలు చేయలేని వారు, మకర సంక్రాంతి రోజున తర్పణాలిస్తే ఏడాదిలో అన్ని సంక్రాంతులకూ ఇచ్చినట్టేనని చెబుతారు. అంతేకాదు, సంక్రాంతి సందర్భంగా పితృదేవతలకు సద్గతులు కలగాలనే సంకల్పంతో వారి పేరిట దానధర్మాలు చేస్తారు. భూదానం, సువర్ణదానం, వెండిదానం, అన్నదానం, పుస్తకదానం, బియ్యం, పప్పు, ఉప్పు, గుమ్మడి కాయ, చెరుకుగడలు, రేగు పండ్లు ఇలా శక్తి మేరకు దానాలు చేస్తారు.

... శ్రీవ్యాస్

స్త్రీ శక్తి

విదుషీమణి.. గార్గి

వేదకాలం నాటి మహిళలు విదుషీమణులు. బ్రహ్మవిద్యపైనా వారికి పట్టు ఉండేది. బృహదారణ్యక ఉపనిషత్తులోని గార్గి అందుకు ఉదాహరణ. జీవన్ముక్తుడైన జనక మహారాజు ఒక గొప్ప యజ్ఞాన్ని చేశాడు. ఎందరో తత్త్వవేత్తలు దానికి విచ్చేశారు. వారిలో గొప్ప జ్ఞానికి దానం చేయాలని సంకల్పించి వేయి గోవులు తెప్పించాడు. ఎవరు గొప్ప జ్ఞానులో వారివే ఇవి అన్నాడు. మహా తత్త్వవేత్త అయిన యాజ్ఞవల్క్య మహర్షి వాటిని తరలించమని శిష్యుడిని పురమాయించాడు. అందరికీ కోపం వచ్చింది. పురోహితుడైన అశ్వలుడు, అరుణి మొదలైన మహర్షులు బ్రహ్మవిద్య గురించి ఎన్నో ప్రశ్నలు వేసి యాజ్ఞవల్క్యుని నుంచి సముచితమైన సమాధానాలు పొందారు. వచక్ను మహర్షి కూతురు గార్గి అక్కడే ఉంది. ఆమె ఎంతో ప్రతిభావంతురాలు. బ్రహ్మవాది, బ్రహ్మచారిణి. ఆమె యాజ్ఞవల్క్య మహర్షిని ఇలా ప్రశ్నించింది..



గార్గి: అన్నీ జలంలోనే ఉన్నాయి కదా! జలం దేనిలో ఉంది?
యాజ్ఞవల్క్యుడు: వాయువులో
గార్గి: వాయివు దేనిలో ఉంది?
యాజ్ఞవల్క్యుడు: అంతరిక్షంలో..

చర్చ పరబ్రహ్మం వరకు వెళ్లింది. ఇక ఇది చర్చించలేనిది, లేదని చెప్పలేం.. అంతా అదే అన్నాడు యాజ్ఞవల్క్యుడు.

గార్గి: త్రికాలాలలో.. మూడు లోకాలలో ఏది వ్యాపించి ఉంది?
యాజ్ఞవల్క్యుడు: ఆకాశం.
గార్గి: ఆకాశం దేనిలో ఉంది?
యాజ్ఞవల్క్యుడు: అక్షరంలో.. అదే పరబ్రహ్మం. అది స్థూలం కాదు. సూక్ష్మం కాదు. పంచభూతాలలో ఏదీ కాదు. ఏకం, అద్వితీయం. లోకాలన్నీ దానివల్లే స్థిరంగా ఉన్నాయి. కాలం సరిగ్గా నడుస్తున్నది. అది లేకపోతే గడ్డిపోచైనా కదలదు.

యాజ్ఞవల్క్యుని విశిష్టమైన విశ్లేషణ విని గార్గి.. ఈ మహర్షిని జయించలేమని పండితులకు చెప్పింది. జనకుడు సంతృప్తి చెంది యాజ్ఞవల్క్యుణ్ని ఘనంగా సన్మానించాడు. ఆనాటి స్త్రీ శక్తి ఎంత గొప్పదో గార్గి వృత్తాంతం తెలియజేస్తుంది.

... డా|| వెలుదండ సత్యనారాయణ

కథాసుధ

మంచి స్నేహం

ఒక కొడుకు పై చదువులకు వెళ్తూ.. తండ్రి ఆశీర్వాదం కోరాడు. 'నువ్వు ఎంత బాగా చదువుతావో నేను అడగను. ఎన్ని మార్కులు సాధిస్తున్నావో కూడా ఆరాలు తీయను. కానీ, ఎలాంటి వ్యక్తులతో స్నేహం చేస్తున్నావని మాత్రం అడుగుతాను' అన్నాడు. పక్కనే ఉన్న భార్య ఎందుకలా ఆశీర్వదించారని భర్తను అడిగింది. అప్పుడు అతను 'నేను చిన్నప్పుడు విన్న కథ చెబుతాను విను.. పూర్వం జన్మవాసనలు తెలిసిన ఒక పండితుడు ఉండేవాడు. ఒకరోజు శిష్యులను దగ్గరికి పిలిచి తనకు చివరి క్షణాలు సమీపిస్తున్నాయని చెప్పాడు. శిష్యులు బాధపడుతూ ఉంటే, తను ఈ శరీరాన్ని వదలి, వారం రోజుల్లో పక్క ఊరిలోనే పుట్టబోతున్నట్లు చెప్పాడు. శిష్యులు చాలా సంతోషించారు. అయితే వారి సంతోషం ఎక్కువసేపు నిలువలేదు. ఎందుకంటే పండితుడు పుట్టబోయేది పంది రూపంలోనని తెలిసింది. కొన్నాళ్లకు పండితుడు మరణించాడు. పదిరోజుల తర్వాత గురువు ఎలా ఉన్నాడో చూద్దామని శిష్యులు పక్క గ్రామానికి వెళ్లారు. అక్కడ పంది రూపంలో బురద గుంటలో పొర్లుతున్న గురువు కనిపించాడు. 'అయ్యో, గురువుకు ఎంత దుర్గతి పట్టింది!' అని విలపిస్తూ పందిరూపంలో ఉన్న గురువును తమతో పాటు తీసుకెళ్లడానికి శిష్యులు సమాయత్తం అయ్యారు. అప్పుడు వరాహ రూపంలో ఉన్న గురువు 'వద్దు వద్దు, నన్ను ఇక్కడినుంచి ఎక్కడికీ తీసుకెళ్లకండి. నాకిక్కడ ఎంతో హాయిగా ఉంది. ఈ హాయి నాకు మరెక్కడా దొరకదు' అని చెప్పి శిష్యులను పంపించాడు. ఇలాంటి దాన్ని 'సహవాస దోషం' అంటారు. పదిరోజులు కలిసి ఉంటే వారు వీరవుతారు, వీరు వారవుతారని పెద్దలు ఎప్పుడో చెప్పారు. మనం ఏం కావాలనుకుంటే వారితో సాంగత్యం చేయాలి. మల్లెలు చుట్టిన దారానికి మల్లెల గుబాళింపు వస్తుంది. అందుకు మంచివారితో సహవాసం చేస్తే మంచి గుణాలు తప్పకుండా వస్తాయని మన అబ్బాయికి అలా ఆశీర్వదించాను' అని వివరించాడు తండ్రి.

... ఆర్.సి.కృష్ణస్వామి రాజు,
93936 62821

భ్రమర కీట న్యాయం-భయ యోగం!

వేదవేద్యుడు విష్ణువు కృష్ణునిగా అవతరించగా వేదమే అపర వాసుదేవుడైన వ్యాసుని వలన భాసురమైన భాగవతంగా ఆవిర్భవించింది. ఈ పురాణంలో ఆది, మధ్య, అవసానాలలో భక్తి, జ్ఞాన, వైరాగ్య జనకాలైన కథనకాలు అనేకం. కృష్ణ చరితం ఆసాంతం వేదాంత వైవిధ్య భరితం. సంస్కృత భాగవతాన్ని భాషాంతరీకరించిన (తెనిగించిన) కథన–కారణాన, పోతనకే కాక భాగవతానికి కూడా పునర్జన్మ లేకుండా పోయింది కదా! ఆంధ్ర భాగవతంలోని వేదాంత పరమైన అనేక పద్యాలు, పొగమంచును తెగటార్చే ఛాయాపతి– సూర్యుని వలె జీవుల మాయా తిమిరాన్ని– చీకటిని పోకార్చే అధ్యాత్మ ప్రదీపాలు. బ్రహ్మవిద్యను బోధించే 'ఆంధ్రోపనిషత్తులు'గా అద్యావధి– నేటి వరకు కడు హృద్యాలై కాంతులీనుతున్నాయి.

శుకయోగి పరీక్షిత్తుతో.. రాజా! అనంతుడు– ఆదిశేషుడు అవనిపై బలరామునిగా అవతరించిన అనంతరం, అనాది నిధనుడు ఆదినారాయణుడు మేదినీ– భూమి భారం అంతం చేయడానికి తన నితాంత– సంపూర్ణ తేజంతో– షోడశ కళలతో ఆనక దుందుభి– వసుదేవుని అంతరంగంలో ఆవహించాడు. అమోఘమైన ఆ వైష్ణవ తేజాన్ని వసుదేవుడు మనసా– మానసీ దీక్షగా దేవకీ దేవి యందు ప్రవేశపెట్టాడు. తూర్పుదిక్కు చంద్రుని ధరించిన విధంగా ఆమె ఆ తేజాన్ని మనస్సుతో ధరించింది. పున్నమి నాటి యామినీ నాథుని– చంద్రుని, ఉదయంతో తూర్పుదిక్కు అనే భామిని– స్త్రీ ప్రకాశించునట్లు వసుదేవుని కామిని దేవకి దేదీప్యమానంగా వెలిగిపోయింది. ఇతర జీవులకు వలె పరమాత్మకు పితర వీర్య సంబంధం లేదని పరమార్థం! అనంత బ్రహ్మాండాలను తన ఉదరంలో పదిలంగా దాల్చిన దామోదరుడు– మహావిష్ణువు భూలోకాన్ని రక్షించడానికి బాలామణి దేవకి గర్భంలో చూలై– లీలా శిశువై బాల భానుని వలె వర్ధిల్లుతున్నాడు. వేదంలో మాధవునికి– పరమాత్మకు గర్భవాసం ఏ విధంగానూ చెప్పబడలేదు. మరి ఈ గర్భ వర్ణన ఏమిటి? 'గర్భే చ వాయునా పూర్ణే నిర్లిప్తో భగవానజిత్' (బ్రహ్మవైవర్త పురాణం కృష్ణజన్మ ఖండం)– గర్భం గాలిచే పూరింపబడటం వల్ల దేవకి చూసేవారికి చూలింత వలె తోచిందట! కంసుని అధీనంలో– చెరలో ఉంటూనే దేవకీ వసుదేవులు చిరకాలం సాధన చేసి తాము జననీ జనకులుగా రమారమణుని కమనీయ అవతరణకు అధికారం– యోగ్యత సాధించారు. ఆ పుణ్యదంపతులు కారాగృహంలో కంసుని ఎగ్గు (అపకారం, అనాదరణ)లతో మగ్గుతూ కూడా నిగ్రహంతో గోవిందుని అనుగ్రహం అందుకొని ఆయనను నందను(పుత్రు)నిగా పొందగలిగారు. 'సాధనాత్ సాధ్యతే సర్వం'– సాధన ద్వారా సాధ్యం కానిది లేదు కదా!

మన పోతన మధురిమ 156 వ భాగం

కం|| 'జ్ఞాన ఖలునిలోని శారదయును బోలె
ఘటములోని దీపకళిక వోలె
భ్రాతయింట నాఁకఁ బడియుండె దేవకీ,
కాంత విశ్వగర్భ గర్భ యగుచు'

విశ్వాన్ని తన కుక్షిలో నిక్షిప్తం చేసుకొన్న నీరజాక్షుడు– విష్ణువునే తన గర్భంలో అర్భకునిగా– బిడ్డగా ధరిస్తూ ఉన్నా కూడా దేవకి, యోగ్యులైన శిష్యులకు నిష్కపటంగా బోధించక తనలో దాచుకునే జ్ఞాన వంచకుని విద్యవలె, లోపల వెలుగుతున్నా వెలుపలికి శోభించని.. కుండలో దాచిన దీపజ్వాల వలె, అన్న కారాగృహంలో నిర్బంధంలో ఉన్నందున ఎల్లరకు ఆహ్లాదం కలిగిస్తూ విరాజిల్లలేకపోయింది. 'సర్వజగన్నివాస నివాస భూత' అని ఉన్న మూలానికి పోతన్న గారి 'విశ్వగర్భ గర్భ' అన్న తెనుగు సేత ఎంత మధుర భావ గర్భితంగా ఉందో చూడండి!

కారాగేహంలో దేవకి దేహాన్ని పరికించిన కంసునికి– మునుపెన్నడూ ఇలా శోభించని ఈమె గర్భంలో ఇప్పుడు వెన్నుడు– నా ప్రాణాలను హరించు అరి (శత్రువు) శ్రీహరి దూరి ఉంటాడన్న సందేహం మితిమీరింది. సోదరి దరి చేరి మనసులో పరిపరివిధాల ఇలా తలపోశాడు... 'ఈ ఇంతి గర్భం అంతకంతకూ అధిక కాంతివంతమవుతోంది. చూలింత! చెల్లెలు!– ఎలా చంపేది? చంపితే నా ఆయువు, ఐశ్వర్యం, యశము, ధర్మం– అన్నీ చెడిపోవా? చంపక మానితే నా ప్రాణానికే హాని కదా! ఏదేమైనా భగినిని చంపడం భయంకర పాపం' అని భావించి లోలోపల కల్లోలపడుతున్నా పైన గాంభీర్యం పులుముకొని అలవి కాని అలుక– వైరంతో– 'బిడ్డ పుట్టనీ, పురిటింటిలోనే వాణ్ని పట్టి మట్టుపెడతా' అనుకొని కానుపు కోసం కనిపెట్టుకు కూర్చున్నాడు. శుక ఉవాచ...

కం|| 'తిరుగుచుఁ గుడుచుచుఁ ద్రాగుచు
నరుగుచుఁ గూర్చుండి లేచు చనవరతంబున్
హరిఁదలఁచి తలచి జగ మా
హరిమయ మని చూచెఁ గంసుఁడారని యలుకన్'

'రాజా! శ్రీహరిపై గల వైరం వలన తింటున్నా, తిరుగుతున్నా, తాగుతున్నా, తూగుతున్నా, కూర్చున్నా, లేచినా కంసుడు... చల్లారని పగతో ఉల్లం–మనస్సులో మరో ధ్యాస లేకుండా నిరంతరం హరినే తలుస్తూ ప్రహ్లాదుని వలె జగమునంతా హరిమయంగా చూడసాగాడు'. 'అపశ్యత్ తన్మయం జగత్' (జగమాహరి మయమని చూచె) అన్న మూలానికి పోతన్న చేసిన ఇంపైన వ్యాఖ్యానంతో కూడిన పెంపుదల..

సీ|| శ్రవణ రంధ్రముల నే శబ్దంబు వినఁబడు
నది హరిరవ మని యాలకించు,
నక్షిమార్గమున నెయ్యది చూడఁబడు నది
హరిమూర్తి గానోపు నంచుఁ జూచుఁ,
దిరుగుచో దేహంబుఁ దృణమైన సోకిన
హరి కరాఘాతమో యనుచు నులుకు,
గంధంబు లేమైన ఘ్రాణంబు సోకిన
హరిమాలికా గంధమనుచు నదురుఁ'

ఆ|| 'బలుకు లెవ్వియైనఁ బలుకుచో హరి పేరు
పలుకఁ బడియె ననుచు భ్రమసి పలుకుఁ
దలఁపు లెట్టివైనఁ దలఁచి యా తలఁపులు
హరి తలంపు లనుచు నలుగఁ దలఁచు'

'కంసుడు.. చెవులకు ఏ మాట వినిపించినా అది హరి మాటేనని మాటేసి వింటాడు. కన్నులకు ఏది కనిపించినా అది తన్ను మన్ను కరిపించే వెన్నుని (విష్ణుని) రూపమేనని పరికించి ఖిన్నుడవుతాడు. ఒంటికి గడ్డిపరక తగిలినా, అది శ్రీహరి చేతి చావు దెబ్బేనని ఉలికిపడి గావుకేక పెడతాడు. ముక్కురంధ్రాలకు ఏ వాసన సోకినా అది ముకుందుని వనమాలికా గంధమే అని అదరిపోతాడు. నోట ఏ మాట వచ్చినా వనమాలి పేరే పలికానని భ్రమపడి బెదరి ఆ పేరే పలవరిస్తాడు. తన తలపులు– ఆలోచనలన్నీ అచ్యుతుని ఆలోచనలేమో అని ఆగ్రహిస్తాడు' ఇలా శబ్ద స్పర్శ రూప రస గంధాలనే విషయాలను గ్రహించే కంసుని ఇంద్రియాల వ్యాపారాలన్నీ ఇందీవర శ్యాముని– విష్ణుని చేష్టలే అయ్యాయి. ఇలా అతనికి



నిరోధం– మనోలయం కలిగింది. ప్రపంచ విస్మరణ, పరమాత్మ అఖండ స్మరణ!– ఇదే నిరోధం! కంసుని చిత్తంలో ఒకే వృత్తి– అంతఃకరణ ప్రవృత్తి– విష్ణు భయ వృత్తి! ఈ భయంతోనే కంసుడు 'అభయ' పదవి– ముక్తి పొందాడు. నారద మహర్షి కంసునికి చేసిన మహోపకారం ఇదే!

తంగిరాల
రాజేంద్రప్రసాద శర్మ
98668 36006

'భయం' కూడా భగవత్ప్రాప్తికి ఒక యోగం– ఉపాయం, సాధనమన్న మాట! తుమ్మెద ఒక పురుగును తెచ్చి, నిర్బంధించి దాని చుట్టూ ఝుంకారం చేస్తూ, తిరుగుతూ ఉంటుంది. ఆ పురుగు, భయంతో ఎదలో ఆ తుమ్మెదనే తలచి తలచి భ్రాంతిపడి చివరికి తుమ్మెదగా మారుతుంది. దీనికే భ్రమర కీట న్యాయం, 'భయ యోగం' అని పేరు. వైర మూలకమైన స్వామి స్మరణ కూడా ముక్తి దాయకమేనని ఘోషించింది... ధరణి (భూమి) మీద సనాతన ధర్మవాణి మాత్రమే! ఎవనికైనా శత్రువును గురించిన స్మరణ రేయింబవళ్లు నిరంతరంగా సాగుతుంది. భక్తికి నోచుకోని దానవులందరూ భగవంతుని పట్ల వైరం (విరోధం) వహించి శ్రీహరి సారూప్యాన్ని వరించారు. భగవంతుని యందు వైర భావం వలన ఏర్పడే తన్మయత్వం భక్తి వల్ల కూడా కలగదని భక్తి దర్శనానికి ఆచార్యుడైన నారద మహర్షి మతం! సాధన బాహుళ్యం– పరమాత్మ ప్రాప్తికి సాధనాలు అనేకంగా ఉండవచ్చన్న భావం, ఉపాస్యానా మనియమం– 'ఫలానా దైవమే ఉపాసించ తగినది' అనే నియమం లేకుండుట... ఇవి సనాతన వైదిక ధర్మ విశిష్టతలు మాత్రమే! 'యద్యత్ పశ్యతి చక్షుర్భ్యాం, యద్యత్ శృణోతి కర్ణాభ్యాం, యద్యత్ స్పృశతి హస్తాభ్యాం... తత్తదాత్మేతి భావయేత్' (నేత్రాలకు కనిపించే రూపాలన్నీ, శ్రోత్రాలకు వినిపించే శబ్దాలన్నీ, హస్తాలకు తగిలే– తాకే స్పర్శలన్నీ 'ఆత్మ' మాత్రమే అని భావించాలి) 'యోగ తత్త్వోపనిషత్తు' చేసే ఈ ఘోష (గోస)–ధ్వనికి ప్రతిధ్వనియే పోతన గారి పై సీస పద్యం!

(సశేషం)

ఇస్లాం బోధ

బాధ్యత తెలుసుకో!

ఓ అందమైన తోట.. అందులో రెండు మహావృక్షాల నీడలో పిల్లలు ఆడుకుంటూ సేదతీరేవారు. వాటి మధురమైన ఫలాలను ఆస్వాదించేవారు. అటుగా వెళ్లే బాటసారులకూ ఆ చెట్లు నీడనిచ్చేవి. కొన్నాళ్లకు వాటిలో ఒక వృక్షం ఎండిపోయి నేలకొరిగింది. మరో వృక్షం ఒంటరిదైపోయింది. సాటి మాను కూలిపోయిందని బెంగపెట్టుకుంది. అదీ ఎండిపోతూ క్షీణదశకు చేరుకోసాగింది. ఆకులన్నీ రాలిపోసాగాయి. తక్కువ కాలంలోనే అదీ ఎండిపోయి నేలకొరిగింది. ఆ తర్వాత చాలా కాలం దాకా స్థానికులు ఆ జంట వృక్షాల గురించి కథలు కథలుగా చెప్పుకొన్నారు. కొంతకాలానికి అంతా మర్చిపోయారు. అక్కడ ఒకప్పుడు చెట్లు ఉండేవన్న సంగతే మర్చిపోయారు. సరిగ్గా ఇలాగే.. మన ఇంట్లో ఉన్న రెండు మహావృక్షాలు తల్లిదండ్రులు. మనల్ని కని, పెంచి, పోషించి, సభ్యత, సంస్కారాలు నేర్పిస్తారు. పిల్లలు కోరిన కోరికలన్నీ నెరవేరుస్తారు. బిడ్డల కోసం అహరహం శ్రమిస్తారు. కంటికి రెప్పలా కాపాడుతారు. ఆ పిల్లలు పెరిగి, పెద్దవారయ్యాక ఎవరిదారి వాళ్లు చూసుకుంటారు. అప్పుడు ఆ తల్లిదండ్రులు కథలోని మహావృక్షాల్లా బిక్కుబిక్కుమంటూ పిల్లల కోసం ఎదురు చూస్తుంటారు. చూపు కానరాక, నడవలేక బలహీనావస్థకు చేరుకుంటారు. అందరూ ఉన్నా.. ఎవరూ లేని అనాథల్లా బతుకీడుస్తుంటారు. అవసాన దశలో ఉన్న తల్లిదండ్రులకు సేవ చేయడం బిడ్డల బాధ్యత. దానిని విస్మరిస్తే అంతకన్నా ఘోర పాపం మరొకటి ఉండదంటారు ప్రవక్త (స). 'మీరు ఏమి ఖర్చు చేసినా దానిని మీ తల్లిదండ్రుల కోసం, బంధువుల కోసం, అనాథలు, నిరుపేదలు, బాటసారుల కోసం ఖర్చు చెయ్యండి. మీరు ఏ మేలు చేసినా, దాన్ని అల్లాహ్ తెలుసుకుంటాడు' అని ఖురాన్ వాక్యం. తల్లిదండ్రులను విశ్వసించే వారందరూ లెక్క ఖరారు అయ్యేరోజున మన్నింపు పొందుతారని అల్లాహ్ ఉద్బోధ. మనకు జీవితాన్ని ధారపోసిన తల్లిదండ్రులను కంటికి రెప్పలా కాపాడుకోవడం కనీస ధర్మం.

... ముహమ్మద్ ముజాహిద్, 96406 22076